నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
04.

**రష్మిక, వైదేహి**

తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక జోడీ విజేతగా నిలిచింది. డిసెంబర్ 2న అహ్మదాబాద్‌లో జరిగిన మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ మహిళల డబుల్స్ ఫైనల్లో రష్మిక-వైదేహి చౌదరి జోడీ విజయం సాధించింది. వీరు సోహా సాదిక్, ఆకాంక్ష జంటను ఓడించారు.

# ధూమ శకటం.. దేశ రవాణాలో కీలకం

## భారతీయ రైల్వే

- భారతదేశంలో అత్యంత ప్రధానమైన రవాణా సాధనం రైల్వే. సరుకులు, ప్రయాణికుల రవాణా రెండింటికీ రైల్వే అత్యంత కీలకం. దేశంలోని సుదూర ప్రాంతాల ప్రజలందరినీ సంఘటితం చేసి వ్యాపార నిర్వహణ, సుందర ప్రదేశాల వీక్షణం, తీర్థయాత్రలు, విద్యాపరమైన యాత్రలకు సహాయకారిగా ఉంటుంది.
- బ్రిటన్‌కు చెందిన 'జార్జి స్టీఫెన్సన్' రైల్వే పితామహుడిగా ప్రసిద్ధి చెందారు. ఎందుకంటే 1814లో ఎక్కువ వ్యాగన్లను లాగే సత్తా ఉన్న స్టీమ్ లోకోమోటివ్ ఇంజిన్ తయారు చేయడం వల్ల.
- ప్రపంచంలో తొలిసారిగా 1825, సెప్టెంబర్ 25న బ్రిటన్‌లోని స్టాక్‌టన్ నుంచి డార్లింగ్టన్ మధ్య తొలి పబ్లిక్ ప్యాసింజర్ రైలును నడిపారు.
- లార్డ్ డల్హౌసీ గవర్నర్ జనరల్‌గా ఉన్న కాలంలో ముంబయి-థానె మధ్య మొదట 34 కి.మీ. దూరం ప్రయాణికుల రైలును నడిపారు.
- భారతీయ రైల్వే ఇప్పుడు 68,043 కి.మీ. నిడివిలో 7308 స్టేషన్లు, 13,125 లోకోమోటివ్‌లు, 85,744 ప్రయాణికుల కోచ్‌లు, 3,18,896 వ్యాగన్లతో సువిశాల నెట్‌వర్క్‌గా విస్తరించింది.
- 68,043 కి.మీ. నిడివితో బహుళ గేజ్ లైన్లతో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ప్రస్తుతం రైల్వే లైన్లను 5 గేజ్‌లుగా విభజించారు. అవి..
  1) బ్రాడ్ గేజ్ లేదా ఇండియన్ గేజ్ (79 శాతం)- 1.676 మీ.
  2) మీటర్ గేజ్ (16 శాతం)- 1.000 మీ.
  3) న్యారోగేజ్ (3 శాతం)- 0.762 మీ.
- ఈ గేజ్ ప్రస్తుతం హిమాలయా ప్రాంతంలో కల్కా-సిమ్లా, పఠాన్‌కోట్-కాంగ్రా, సిలిగురి-డార్జిలింగ్‌ల మధ్య అమల్లో ఉంది.

4) **లైట్ న్యారోగేజ్- 0.610 మీ.**
- ఈ గేజ్‌ను పారిశ్రామిక ప్రాంతాల్లో ఉపయోగిస్తారు.

5) **స్టాండర్డ్ గేజ్- 1.435 మీ.**
- దీన్ని స్టీఫెన్సన్ గేజ్ లేదా ఇంటర్నేషనల్ గేజ్ అని పిలుస్తారు.
- అలాగే దీన్ని మెట్రో మార్గాల్లో ఉపయోగిస్తారు.
- భవిష్యత్తులో ఏర్పడబోయే రద్దీకి, దేశాభివృద్ధి అవసరాలకు సరిపోయే రవాణా మౌలిక వసతుల అభివృద్ధి చేయడం రైల్వే ప్రణాళిక ప్రధాన లక్ష్యం. ప్రణాళిక శకం ప్రారంభమైన 1950-51 నుంచి భారతీయ రైల్వేలు కొన్ని వార్షిక ప్రణాళికలతో పాటు మొత్తం 9 పంచవర్ష ప్రణాళికలను అమలుపరిచాయి.
- ఈ ప్రణాళిక కాలంలో వ్యవస్థ ఆధునీకరణకు సమగ్ర కార్యక్రమం ఆవిష్కరించాయి. నానాటికి పెరుగుతున్న రైల్వే రవాణా డిమాండును తట్టుకొనేలా వ్యవస్థ విస్తరణకు తక్కువ వ్యయంతో కూడిన సాంకేతికతలపై పెట్టుబడులు పెట్టడం తప్పనిసరి అయింది. ట్రాక్, లోకోమోటివ్‌లు, ప్రయాణికుల కోచ్‌లు, వ్యాగన్ బోగీ డిజైన్లు, సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్ వంటి కీలక విభాగాల్లో ఆస్తుల పునర్వర్గీకరణ, సాంకేతిక మార్పులు, ప్రమాణాల పెంపునకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.



వందే భారత్ రైళ్లు

- 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం, ప్రతిష్ఠ కోసం కేంద్రం విశేషంగా కృషి చేస్తుంది. ఇందుకు భారతీయ రైల్వే తొలిసారిగా ప్రవేశపెట్టిన, దేశీయంగా తయారైన సెమీ హైస్పీడ్ రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్. న్యూఢిల్లీ-కాన్పూర్-అలహాబాద్-వారణాసి మార్గంలో తొలి వందే భారత్ రైలు 2019, ఫిబ్రవరి 15న ప్రారంభమయ్యింది.
- ఈ రైళ్లు ప్రవేశపెట్టడం వెనుక ప్రధాన లక్ష్యం భారతీయ రైల్వేలో అన్ని విభాగాల్లోనూ మెయింటెనెన్స్ టెక్నాలజీలు, విధానాలు అప్‌గ్రేడ్ చేసి రైల్వే ఆస్తులు, సిబ్బంది ఉత్పాదకత, పనితీరును మెరుగుపరచడం. తద్వారా విశ్వసనీయత, లభ్యత, వినియోగం, సమర్థత పెంచడం.
- ప్రపంచ శ్రేణి ప్రయాణికుల సౌకర్యాలతో దేశంలో తొలి సెమీ హై స్పీడ్ రైలు ఇది. వేగవంతమైన యాక్సిలరేషన్ కారణంగా ఈ రైలు అధిక వేగం సాధించగలుగుతుంది. ప్రయాణ సమయం 25 శాతం నుంచి 45 శాతం వరకు తగ్గుతుంది. అలాగే గంటకు 160 కి.మీ. వేగంగా నడుస్తుంది.
- 2023, జులై 28 నాటికి భారత రైల్వే వ్యవస్థలో విద్యుదీకరించిన బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్ ఉన్న రాష్ట్రాల్లో 50 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. భారతదేశంలో దేశీయంగా డిజైన్ చేసి, తయారు చేసిన తొలి సెమీ హై స్పీడ్ వందేభారత్ రైళ్లు ప్రయాణికులకు ఆధునిక, సౌకర్యవంతమైన రైలు ప్రయాణ అనుభూతిని అందిస్తున్నాయి. హై స్పీడ్, భద్రతా ప్రమాణాలు, ప్రపంచ శ్రేణి సేవలు వందే భారత్ రైళ్ల ప్రత్యేకత.
- వందే భారత్ రైళ్లతో అడ్వాన్స్‌డ్ రీజనరేటివ్ బ్రేకింగ్ వ్యవస్థ ఉంది. దీనివల్ల 30 శాతం వరకు విద్యుత్త ఆదా అవుతుంది. మిగిలిన రైళ్ల కంటే ఎక్కువ ఇంధనం ఆదా అవుతుంది.

### కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు

- భారత రైల్వే మంత్రిత్వ శాఖ పాలనా నిర్వహణలో మొత్తం 12 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి. అవి..

1) ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (IRFC)
2) కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ (KRCL)
3) కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కాంకర్)



4) ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్
5) రైట్స్ లిమిటెడ్
6) ముంబయి రైల్వే వికాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (MRVC)
7) ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (IRCTC)
8) రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (RCIL)
9) రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (RVNL)
10) డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (DFCCIL)
11) కోల్‌కతా మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (KMRCL)
12) బ్రైత్ వైట్ అండ్ కంపెనీ లిమిటెడ్ (BCL)

### పరిశోధన, అభివృద్ధి

- లక్నోలోని రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (RDSO) భారతీయ రైల్వేకు చెందిన పరిశోధన, అభివృద్ధి విభాగం. సాంకేతిక అంశాల్లో భారతీయ రైల్వేకు RDSO కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తుంది.
- ఇటీవల సెంట్రల్ రైల్వేకు చెందిన 'కసారా లగత్‌పురి, కర్జాట్ లోనావాలా సెక్షన్ల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్పీడ్ బ్యాలెన్సింగ్, కంట్రోలబిలిటీ ట్రయల్స్‌ను RDSO విజయవంతంగా నిర్వహించింది.

### రైల్వే ఫైనాన్స్

- కేంద్ర ప్రభుత్వ స్థూల ఆర్థిక గణాంకాల్లో ఒక విభాగమే అయినప్పటికీ 1924 సెపరేషన్ కన్వెన్షన్ కారణంగా 1924-25 నుంచి రైల్వే బడ్జెట్‌ను పార్లమెంటుకు ప్రత్యేకంగా సమర్పిస్తూ వచ్చారు.
- సాధారణ ఫైనాన్స్‌లో రైల్వే ఫైనాన్స్ విశేషమైన వాటా కలిగి ఉండటం వల్ల స్థిరత్వం కోసం సెపరేషన్ కన్వెన్షన్ రూపొందించారు. అయితే 2017-18 బడ్జెట్ సంవత్సరం నుంచి రైల్వే బడ్జెట్‌ను జనరల్ బడ్జెట్‌లో విలీనం చేశారు. ఈ బడ్జెట్ ఏకీకరణంతో రైల్వే వ్యవహారాలు కూడా కేంద్రీయ స్థానం ఆక్రమించడం వల్ల ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర చిత్రం ఆవిష్కరించడం సాధ్యమయ్యింది.

### రైల్వే విద్యుదీకరణ

- దేశంలో మొదటి 'ఎలక్ట్రికల్ రైల్' దక్కన్ క్వీన్ 1929లో పుణె-కల్యాణ్ మధ్య ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనిచేసే స్థితిలో ఉన్న ప్రపంచంలోనే అతి పురాతన రైల్వే ఇంజిన్ పేరు 'ఫెయిరీ క్వీన్'.
- రైల్వేల వంద శాతం విద్యుదీకరణ ప్రణాళిక దేశంలోని మొత్తం ఇంధన రంగానికి అత్యంత కీలకం. క్రూడాయిల్ దిగుమతులను తగ్గించి విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయడం లక్ష్యంగా ప్రాథమికంగా రైల్వే విద్యుదీకరణ చేపట్టారు. అధిక సామర్థ్యం గల విద్యుత్ లోకోమోటివ్‌ల ప్రభావం వల్ల అటు సరకు రవాణాలోను, ఇటు ప్రయాణికుల రైళ్లలోను వేగం, లోడింగ్ సామర్థ్యం పెరిగింది.
- కర్బన వ్యర్థాలు తగ్గించి, దేశానికి పర్యావరణహితమైన, హరిత, స్వచ్ఛ రవాణా సాధనాన్ని అందించాలనేది పౌరుల ఆకాంక్ష విద్యుదీకరణతో తీరుతుంది. 2023, మార్చి నాటికి కొంకణ్ రైల్వే సహా భారతీయ రైల్వేల విద్యుదీకరణ 58,812 కిలోమీటర్లకు విస్తరించింది. దీనిలో బ్రాడ్‌గేజ్ (1.676 మీ.) రైల్వే నెట్‌వర్క్ వాటా 90 శాతం ఉంది.

### రైల్ టూరిజం

- దేశంలోని వివిధ టూరిస్టు గమ్యాలను అనుసంధానం చేయడం ద్వారా పర్యాటక రంగానికి భారతీయ రైల్వే ప్రధాన చోదక శక్తిగా ఉంది. 'భారత్ గౌరవ్ ట్రెయిన్లు' విధానం పేరుతో థీమ్ ఆధారిత సర్క్యూట్ రైళ్లను భారతీయ రైల్వే ప్రవేశ పెట్టింది. సుసంపన్నమైన భారత సాంస్కృతిక వారసత్వాన్ని, అద్భుతమైన చారిత్రక ప్రదేశాలను పర్యాటక రంగానికి చెందిన వృత్తి నిపుణులు, ఇతర సర్వీసు ప్రొవైడర్ల సహాయంతో దేశ విదేశాలకు చెందిన ప్రజలకు చూపించడం ఈ విధానం లక్ష్యం.

### నేషనల్ రైల్ ప్రణాళిక

- 'భవిష్యత్తు-సంసిద్ధత' గల రైల్వే వ్యవస్థను సృష్టించే లక్ష్యంతో భారతీయ రైల్వే శాఖ 'నేషనల్ రైల్ ప్లాన్ (NRP) ఫర్ ఇండియా-2030'ని రూపొందించింది. దీని లక్ష్యాలు..

1) మొత్తం సరకు రవాణాలో రైల్వే రవాణా వాటాను 45 శాతం పెంచడం లక్ష్యంగా నిర్వహణా సామర్థ్యాలు, వాణిజ్య విధానంతో కూడిన వ్యూహాల రూపకల్పన
2) రైళ్ల సగటు వేగాన్ని గంటకు 50 కి.మీ. పెంచడం ద్వారా సరకు రవాణా సమయాన్ని తగ్గించడం

- నేషనల్ రైల్ ప్లాన్‌లో భాగంగా విజన్ 2024ను రూపొందించారు. దీని కింద చేపట్టే కీలక ప్రాజెక్టుల్లో వంద శాతం విద్యుదీకరణ. రద్దీ అధికంగా ఉన్న రూట్లలో బహుళ ట్రాక్‌ల నిర్మాణం, ఢిల్లీ-హౌరా, ఢిల్లీ-ముంబయి రూట్లలో రైళ్ల వేగం గంటకు 160 కిలోమీటర్లకు పెంపు, గోల్డెన్ క్వాడ్రిలాటరల్-గోల్డెన్ డయాగ్నల్ (జీక్యూ-జీడీ) రూట్లలో రైళ్ల వేగం గంటకు 130 కి.మీ.కు పెంపు.

---

1. 2022, మార్చి నాటికి భారతీయ రైల్వే ఫ్లీట్‌లో ఉన్న రైల్వే ఇంజిన్ల సంఖ్యలో సరైనవి?
   1) 8429 విద్యుత్ ఇంజిన్లు
   2) 4747 డీజిల్ ఇంజిన్లు
   3) 39 స్టీమ్ ఇంజిన్లు 4) పైవన్నీ సరైనవే
2. 2022, మార్చి నాటికి మొత్తం రైల్వే నిడివిని గుర్తించండి?
   1) 68,043 కి.మీ. 2) 65,043 కి.మీ.
   3) 66,043 కి.మీ. 4) 67,043 కి.మీ.
3. భారతదేశంలోనే పొడవైన 'రైల్ కమ్ రహదారి' వంతెన అయిన 'బోగీబీల్' బ్రిడ్జిని ఏ నదిపై నిర్మించారు?
   1) గోదావరి 2) గంగా
   3) బ్రహ్మపుత్ర 4) యమున
4. పేదలు, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకే ఏసీ సదుపాయంతో ఏర్పాటు చేసిన మొదటి గరీబ్ రథ్ రైలును ఎక్కడ ప్రారంభించారు?
   1) సికింద్రాబాద్ 2) ముంబయి
   3) కోల్‌కతా 4) ఢిల్లీ
5. కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ దేశంలో మొదటి సారిగా ప్రైవేట్ రంగంలో నిర్మించిన రైల్వే మార్గం. దీని ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) కోల్‌కతా 2) నవీ ముంబయి
   3) కొచ్చిన్ 4) మంగళూరు
6. భారతదేశంలో మొదటి 'గ్రీన్ రైల్వే స్టేషన్'ను ఎక్కడ నిర్మించారు?
   1) సిమ్లా 2) కాంగ్రా
   3) లేహ్ 4) మన్వాల్
7. భారతదేశంలో ప్రైవేట్ రంగంలో ప్రారంభించిన మొట్ట మొదటి రైలును ఏ పట్టణాల మధ్య నడిపారు?
   1) గ్వాలియర్-వారణాసి 2) ఢిల్లీ-వారణాసి
   3) లక్నో-భోపాల్ 4) ఇండోర్-వారణాసి
8. ప్రస్తుతం యునెస్కో జాబితాలో చోటు సంపాదించిన భారతీయ రైల్వేల సంఖ్య '6'. దీనిలో మొదటిది?
   1) డార్జిలింగ్-హిమాలయా రైల్వే
   2) ఛత్రపతి శివాజీ టెర్మినల్
   3) నీలగిరి మౌంటెయిన్ రైల్వే
   4) కోల్‌కతా-సిమ్లా రైల్వే

**సమాధానాలు**
1-4, 2-1, 3-3, 4-1, 5-2, 6-4, 7-4, 8-1.

**జీ గిరిధర్**
సివిల్స్ ఫ్యాకల్టీ
యూనివర్సల్ కోచింగ్ సెంటర్
హైదరాబాద్
9966330068

